7న గురుకుల కళాశాలల్లో ప్రవేశాల కౌన్సెలింగ్

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐ.టి.డి.ఏ పరిధిలో బాలికల గురుకుల కళాశాలలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశం నిమిత్తం ఈనెల 7న జిల్లా కేంద్రం పాడేరు లోని ఏ.పీ. ఆర్. బాలికలలో రెండవ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ఐ.టి.డి.ఏ. పి.ఓ. అభిషేక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి కౌన్సిలింగ్లో సీటు పొందని విద్యార్థినులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఈనెల 7న శుక్రవారం ఉదయం 10 గంటలకు హాజరు కావాలని ఆయన తెలియజేశారు.

ఎస్ఎఫ్ఐ హర్షం

గురుకులాల్లో ఈ ఏడాది ఇంటర్ ప్రవేశం కల్పించేందుకు రెండో కౌన్సిలింగ్ నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం పై ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కే ప్రభుదాస్ ఉపాధ్యక్షుడు చిన్నారావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుకులాల్లో ఇంటర్ అడ్మిషన్లు పూర్తిస్థాయిలో నిర్వహించాలని దరఖాస్తు చేసుకున్న బాలికలు బాలురకు అడ్మిషన్లు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

పూల 'వర్షం'లో పోరుకేక

సమరోత్సాహంతో ఎన్టిఆర్ జిల్లాలోకి ప్రవేశించిన పోలవరం నిర్వాసితుల మహాపాదయాత్ర

భారీ జన సమూహంతో సాగుతున్న పాదయాత్ర

ప్రజాశక్తి - విజయవాడ, అజిత్ సింగ్‌నగర్

పోలవరం నిర్వాసితులు పోరు కేక మహా పాదయాత్ర సోమవారం సాయంత్రం 6 గంటలకు జోరు వర్షంలో ఎన్టిఆర్ జిల్లాలోకి ప్రవేశించింది. విజయవాడ రూరల్ మండలం నున్న, గన్నవరం మండలం ముస్తాబాద సరిహద్దు మీదుగా ఎన్టిఆర్ జిల్లాలోకి ప్రవేశించిన ఈ యాత్రకు విజయవాడ కండ్రిక వద్ద జిల్లాలోకి ప్రవేశించింది. మహా పాదయాత్ర అక్కడి నుండి విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ డాబా కొట్లు సెంటర్‌కు చేరుకునే సమయంలో పాయకాపురం వద్ద జోరున వర్షం ప్రారంభమైంది అయినా పాదయాత్ర కొనసాగింది. పాదయాత్ర బందంలోని వారు తమ వద్ద ఉన్న గొడుగులు, రైన్ కోట్లు ధరించి వర్షాన్ని సైతం లెక్కచేయకుండా డాబా కొట్లు సెంటర్ వరకూ కొనసాగించారు. "జిందాబాద్ సిపిఎం...జిందాబాద్ సిపిఎం...మహా పాదయాత్రకు స్వాగతం..." అంటూ యాత్ర పొడవునా నినాదాలు చేశారు. కండ్రిక నుండి ప్రకాష్ నగర్ సెంటర్, పాయకాపురం మీదుగా డాబా కొట్లు సెంటరు వరకు అడుగడుగునా పూలవర్షం కురిపించారు. వందలాది మందితో యాత్ర క్రమశిక్షణాయుతంగా సాగింది. ఎక్కడా ట్రాఫిక్‌కు అంతరాయం కలగనీయకుండా రెండు లైన్లలో క్రమశిక్షణగా బృందం సభ్యులు నడిచారు. పాదయాత్ర ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. నగరంలోని పార్టీ శ్రేణులతోపాటు సిఐటియు, ఐద్వా, ముఠా కార్మిక సంఘం, భవన నిర్మాణ కార్మిక సంఘం, హమాలీ, ఆటో వర్కర్స్ యూనియన్, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, కెవిపిఎస్, ప్రజానాట్యమండలి తదితర ఉద్యోగ కార్మిక సంఘాల నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాదయాత్రకు పెద్దఎత్తున ఎదురేగి పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు.

అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

వర్షంలో రైన్ కోట్లు, గొడుగులతో కొనసాగుతున్న యాత్ర

యాత్రకు నేతృత్వం వహిస్తున్న వి.శ్రీనివాసరావుకు పూలమాలలు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు చేపట్టిన ఈ యాత్రకు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై,వెంకటేశ్వరరావు (వైవి), సిహెచ్.బాబూరావు, మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు స్వాగతం పలికారు. తెలుగు రైతు గన్నవరం నియోజకవర్గ అధ్యక్షుడు గుంటక సుబ్బారెడ్డి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు దండు సుబ్రహ్మణ్యం రాజు మద్దతు తెలిపారు. యాత్రలో పాల్గొన్న వారికి చిరు ఆదిత్యం ఇచ్చారు. యాత్రకు ఘన స్వాగతం పలికిన వారిలో సిపిఎం ఎన్టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కష్ణ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ తదితరులు ఉన్నారు. అనంతరం డాబా కొట్లు సెంటరులో బహిరంగ సభ జరిగింది.

నేడు యాత్ర ముగింపు - బహిరంగ సభ

హాజరుకానున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు

ఈ మహాపాదయాత్ర మంగళవారం ఉదయం 9 గంటలకు విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ డాబా కొట్లు సెంటరు నుండి ప్రారంభవుతుంది. సింగ్‌నగర్ ఫ్లైవోవర్, ముత్యాలంపాడు గవర్నమెంట్ ప్రెస్ సెంటరు మీదుగా అలంకార్ సెంటరులోని ధర్నా చౌక్ వద్దకు చేరుతుంది. అనంతరం అక్కడ జరిగే బహిరంగ సభతో మహా పాదయాత్ర ముగుస్తుంది. ఈసభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు ముఖ్య అతిథిగా పాల్గొంటారు.

సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న కళాకారులు

జాబ్ మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి-పాడేరు: విభిన్న ప్రతిభావంతుల, వయో వృద్ధుల శాఖ అల్లూరి జిల్లా విభాగం ఆధ్వర్యంలో సోమవారం పాడేరులోని కలెక్టరేట్లో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. యంగ్ ప్రొఫెషనల్ నేషనల్ కెరీర్ సర్వీస్, యూత్ ఫర్ జాబ్స్ సహకారంతో నిర్వహించిన ఈ జాబ్ మేళాలో 97 మంది హాజరయ్యారు. ఇందులో 42 మంది కి నైపుణ్యాభివృద్ధికి యూత్ ఫర్ జాబ్స్ సహకారంతో ఉచిత భోజన వసతి సౌకర్యాలు కల్పించి శిక్షణ ఉపాధి కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మిగిలిన వారికి వారి నైపుణ్యాన్ని బట్టి వివిధ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ విభిన్న ప్రతిభావంతుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మాధవి సూపరింటెండెంట్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సర్పంచులు

సర్పంచ్‌ల నిరసన

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు: 14,15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని ఎంపీడీవో కార్యాలయం ఎదుట సిపిఎం సర్పంచ్ కొర్ర త్రినాథ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. విజయవాడలో అరెస్టు చేసిన సర్పంచులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ కొమ్ము రామారావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం లక్ష్మీపురం సర్పంచ్, సర్పంచ్ పోరం మండల ఉపాధ్యక్షుడు కొర్ర త్రినాథ్, ఎస్.సుభాష్ చంద్ర మాట్లాడుతూ, కేంద్రం పంచాయితీలకు కేటాయించిన 14,15వ ఆర్థిక సంఘం నిధులు రాష్ట్ర ప్రభుత్వం పంచాయితీ పాలక వర్గం ఆమోదం లేకుండా దుర్వినియోగం చేసిందని, దీంతో దిష్టి బొమ్మల్లా మిగిలి పోయామని వాపోయారు.వైసీపీ ప్రభుత్వం సచివాలయం కన్వీనర్, గృహ సారథులను నియమించి సర్పంచ్‌లకు గౌరవం లేకుండా చేశారని తీవ్రంగా ఖండించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామ పంచాయితీల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఎస్.నర్సింగ్, కే.శివశంకర్, కే.గంగాధర్ పాల్గొన్నరు.

పెదబయలు : 14, 15 ఆర్థిక సంఘం నిధుల్ని రాష్ట్ర ప్రభుత్వం దారిమల్లించడంపై సర్పంచ్ల ఫోరం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మండల కేంద్రంలో ర్యాలీ చేపట్టారు. ఎంపిడిఓ కార్యాలయం ముందు ధర్నా చేశారు. సిప్ఎం జిల్లా కమిటీ సభ్యులు బోండా సన్ని బాబు, సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు అశోక్ మాట్లాడుతూ, పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించక పోవడం పై మండిపడ్డారు. నిధులు లేక పోవడంతో పంచాయతీల పరిధిలో అనేక సమస్యలు నిలిచి పోయాయన్నారు. పంచాయతీ సర్పంచులకు రూ.15000 గౌరవ వేతనం పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సీతగుంట పంచాయతీ ఉప సర్పంచ్ బొండా గంగాధరం, టిడిపి నాయకులు వెచ్చంగి కొండయ్య పాల్గొన్నారు.

పెదబయలులో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సర్పంచులు, నాయకులు

వినతులు స్వీకరిస్తున్న ఐటిడిఎ పిఒ, సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్

స్పందనకు 41 అర్జీలు

ప్రజాశక్తి - రంపచోడవరం

స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 41 అర్జీలు అందించారు. వీటిని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఐటీడీఏ ఏపీవో సిహెచ్.శ్రీనివాసరావు అర్జీలను స్వీకరించారు. మారేడుమిల్లి మండలం పోదులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేకంగా వెయిటింగ్ హాలు, పుల్లంగి గ్రామంలో ఎంఎల్‌హెచ్‌పి ఏర్పాటు చేయాలని. గుడిసె గ్రామంలో స్కూలు భవనం నిర్మించి, ఉపాధ్యాయుడిని నియమించాలని, పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురైన డి.రావిలంక గ్రామంలోని 18 ఏళ్లు నిండినవ ఆరికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ మంజూరు చేయాలని, ముంపుకాని భూములకు పట్టాలు ఇవ్వాలని, అడ్డతీగల మండలం వేటమామిడి గ్రామంలో భూ సమస్య పరిష్కరించాలని, వై.రామవరం మండలం ఎగువ ప్రాంతం గుర్తేడు గ్రామంలో ఇంటి స్థలం సమస్య పరిష్కరించాలని తదితర దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.డేవిడ్ రాజ్, ఎండి యూసఫ్, నాగేశ్వరరావు, ఏడిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ అనూష, పీహెచ్ఓ కె.చిట్టిబాబు, డాక్టర్ ఓబి.ఇందిరా, వెలుగు ఏపిడి ఎ.శ్రీనివాసరావు, ప్రాజెక్ట్ ఆర్టికల్చర్ అధికారి రాంబాబు, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్‌కెవి చౌదరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి - రంపచోడవరం

మండలంలోని తామరపల్లి రైతు భరోసా కేంద్రంలో 90శాతం రాయితీతో రైతులకు సోమవారం విత్తనాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ముసురిమిల్లి ఎంపీటీసీ వంశి కుంజం, తామరపల్లి సర్పంచ్ మిర్తివాడ ఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ గిరిజన రైతులకు 90శాతం రాయితీతో రాష్ట్ర ప్రభుత్వం విత్తనాలు ఇస్తుందని చెప్పారు. ఐటిడిఏ ద్వారా 50శాతం రాయితీతో యంత్ర పరికరాలు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ గంగా, చిట్టిదొర, రైతు భరోసా కమిటీ చైర్మన్ కుంజం అబ్బులు, మాజీ సర్పంచ్ సారపు బాపిరాజు, వైసిపి నాయకులు రామకృష్ణ, అగ్రికల్చర్ అసిస్టెంట్ భాస్కర్, వాలంటీర్లు పాల్గొన్నారు.

విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆదివాసీ గిరిజన సంఘం నాయకులపై దాడులు అమానుషం

ప్రజాశక్తి-అరకులోయ : 1/70 చట్టం అమలు చేయాలని, గిరిజన నేతరుల అక్రమ కట్టడాలపై నిజాయితీగా పోరాడుతున్న ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి.కృష్ణారావు, ఇతర నాయకుల పై హుకుంపేట సర్పంచ్, వైసిపి నాయకులు భౌతిక దాడి చేయడం అమానుసమని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ అన్నారు. ఈ దుర్మార్గపు చర్యను అందరు ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు.మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బాలదేవ్ మాట్లాడుతూ,హుకుంపేట మండల కేంద్రంలో గిరిజ నేతరుల అక్రమ కట్టడాలపై పోరాటం చేస్తున్నామన్నారు. హుకుంపేట సర్పంచ్, వైసీపీ నాయకులు గిరిజననేతరుల అక్రమ కట్టడాలకు బినామీలుగా ఉండి చట్టాలు కాలరాస్తున్నారన్నారు. ఈ విషయమై పోరాడుతున్న ఆదివాసి గిరిజన సంఘం నాయకులపై భౌతిక దాడి చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.దాడి చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. గిరిజ నేతరులకు బినామీలుగా వ్యవహరిస్తూ ఆదివాసుల హక్కులు, చట్టాలు నిర్వీర్యం చేస్తూ పాలన కొనసాగిస్తామంటే ఆదివాసి గిరిజన సంఘం చూస్తూ ఊరుకోదని, దాడి చేసిన వారిపై తక్షణమే చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ దాడిని ఆదివాసి మేధావులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు తీవ్రంగా ఖండించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం అరకువేలి మండల కార్యదర్శి పి.రామన్న, మండల నాయకులు నాని బాబు, బుజ్జిబాబు, బాలకృష్ణ, జోషి, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: ఆదివాసీ గిరిజన సంఘం అల్లూరి జిల్లా ఉపాధ్యక్షుడు తాపూల కృష్ణారావుపై ప్రత్యేక్ష దాడికి పాల్పడిన సర్పంచ్ వెంకట పూర్ణిమ, అనుచరులపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్ష కార్యదర్శిలు ఎంఎం శ్రీను, కె.నర్సయ్యలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పంచాయతీలో కొంత మంది పెద్దలతో అక్రమ నిర్మాణలపై పూర్ణిమలు తీర్మానం చేసి విడుదల చేశారన్నారు. గిరిజన ప్రజా శ్రేయస్సు కోసం పోరాటం చేస్తున్న నాయకులపై వైసీపీ దుండగులను రెచ్చగొట్టి దాడికి పాల్పడడం సరికాదన్నారు. పూర్ణిమ అనుచరు లపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో అల్లూరి జిల్లా వ్యాప్తంగా నిరసనలు ర్యాలీలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

దుంబ్రిగుడ: హుకుంపేట మండలంలో గిరిజన సంఘం అల్లూరి జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణారావుపై దాడికి పాల్పడిన సర్పంచ్ పూర్ణిమతో పాటు ఆమె అనుచరులపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గిరిజనేతరులు నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలకు వ్యతిరేకంగా నిరంతరం గిరిజన సంఘం పోరాటం చేస్తుందన్నారు. తక్షణమే దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలినీ లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయలో ఆందోళన చేపడుతున్న నాయకులు

దాడులకు భయపడేది లేదు

ప్రజాశక్తి -హుకుంపేట: మండల కేంద్రంలోని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తాపూల కృష్ణారావుపై దాడికి పాల్పడిన సర్పంచ్ వెంకట పూర్ణిమ అనుచరులపై చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం, సీఐటీయూ, సీపీఎం నేతలు పి.సోమన్న, టి అప్పలకొండ పడల్, వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో మీడియా సమావేశంలో ,టి.అప్పలకొండ పడల్, వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు మాట్లాడుతూ, సర్పంచ్ వెంట పూర్ణిమ పంచాయతీలో కొంత మంది పెద్దలతో అక్రమ నిర్మాణల పై ఏక పక్షతీర్మానం చేసి రెవిన్యూ, ఆటవి శాఖ అధికారులకు ఇచ్చారన్నారు.దీనిని ఖండించి ప్రకటన విడుదల చేయాడం జరిగిందని స్పష్టం చేశారు. గంతంలో అనేకమంది గిరిజనేతరులు కడుతున్న వాటిపై ఎందుకు లిఖితపూర్వకంగా పంచాయతీ పెద్ద లతో తీర్మానం ఇవ్వ లేదని వారు ప్రశ్నించారు. ఆదివాసీ గిరిజన సంఘం, సిపిఎం గతకొద్ది దశాబ్దాల కాలంగా 1/70 చట్టం, గిరిజనుల హక్కులు,అక్రమ నిర్మాణలపై నిరంతరం పోరాటం చేస్తుందన్నారు.కృష్ణారావు పైకి అనుచరులను ఉసిగొల్పి దాడికి పాల్పడటం హేయమైన చర్య అన్నారు.ఆదివాసీ గిరిజన సంఘం నేత కృష్ణారావు మాట్లాడుతూ, తనపై అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా నరకేస్తాం అని బెదిరించారన్నారు.సోమవారం ఉదయం 7గంటల సమయం లో తాను ఇంట్లో ఉండగా సర్పంచ్ వెంకట పూర్ణిమ అనుచరులు, వైసీపీ నేత పాంగి. అనిల్, జగదిష్ తో పాటు అనేకమంది దాడికి దిగారని ఆయన తెలిపారు. దాడులు చేసి ఉద్యమాన్ని ఎవరూ ఆపలేరని వారు స్పష్టం చేశారు. అనంతరం సర్పంచ్ వెంకట పూర్ణిమ అనుచరులు, వైసిపి నేతలపై పిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు ఎస్.హైమావతి, ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షుడు పాంగి. సోమన్న, సీపీఎం నేతలు కృష్ణమూర్తి, కోటి తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేటలో మాట్లాడుతున్న నాయకులు

పివిటిజిల సమస్యలపై కేంద్ర బృందం ఆరా

ప్రజాశక్తి- అనంతగిరి: పివిటిజీ గిరిజనుల స్థితిగతులను గిరిగిజన వ్యవహారాల శాఖ డిప్యూటీ కార్యదర్శి ఎమ్మె ఎస్. రాణి ఆరా తీశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా గిరిజన ప్రాంతంలో నివసిస్తున్న ఆదిమజాతి పివిటిసి గిరిజనుల స్థితిగతులు తెలుసుకొనందుకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సోమవారం అనంతగిరి మండలం గుమ్మకోట, గరుగుబిల్లి పంచాయతీలలో కేంద్రం బృందం పర్యటించింది. గ్రామాలలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను, జీవనోపాధి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు అమలు తీరుపై ఆరా తీశారు. స్థానిక గిరిజనులతో సమస్యల పట్ల ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేసి పథకాల అమలు, ఉపాధి వంటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గిరిజనులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమకు అందిస్తున్న పలు సంక్షేమ పథకాలు అందడం లేదని, తాగునీటి, రోడ్డు, గృహాలు. వంటి సౌకర్యాలు అందక అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నామని తెలిపారు. దీనికి ముందు గరుగుబిల్లి వైద్య ఆరోగ్య సబ్ సెంటర్‌ను పరిశీలించారు. సబ్ సెంటర్ మరుగుదొడ్లు వంటివి అధ్వానంగా ఉండడంతో సిబ్బందిపై ఆమె మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ .రాంబాయి, ఇన్చార్జి ఎంపీడీవో వివి .కుమార్ పలుచాక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

గిరిజన ప్రాంతంలో నెలకొన్న మౌలిక సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోరుతూ స్థానిక ఎంపీపీ శెట్టి. నీలవేణి లిఖితపూర్వకంగా విన్నవించారు. తాగునీటి. రహదారి, గృహాలు వంటి సమస్యలతో ఆదివాసి గిరిజనులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. జాతీయ ఉపాధి హామీ పథకం పనులు 150 రోజుల కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ .రాంబాయి, ఇన్చార్జి ఎంపీడీవో వివి .కుమార్ పాల్గొన్నారు

సమస్యలను తెలుసుకుంటున్న కేంద్ర బృందం సభ్యులు

'జగనన్న సురక్ష'ను వినియోగించుకోండి

ప్రజాశక్తి-పాడేరు: జగనన్న సురక్ష కార్యక్రమం రెండో రోజు విజయవంతమైందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా రెండో రోజైన సోమవారం 12 మండలాల పరిధిలోని 19 సచివాలయాల్లో జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. వాలంటీర్ల యాప్‌లో వివిధ సర్టిఫికెట్ల కోసం 16,785 వినతులు రాగా, 14,164 దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడం జరిగిందని, అందులో 6,592 సర్టిఫికెట్లు పంపిణీ చేశామన్నారు. 47 దరఖాస్తులు తిరస్కరణకు గురి కాగా మిగిలిన 7,525 సర్టిఫికెట్లు పంపిణీ చేయటం జరుగుతుందని కలెక్టర్ వివరించారు.

నేటి కార్యక్రమాల వివరాలు:

ఈ నెల 4న జిల్లాలోని 12 మండలాల పరిధిలోని 20 సచివాలయాల పరిధిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ఆయా గ్రామస్తులకు అవసరమైన 11 రకాల ధ్రువపత్రాలు పంపిణీ చేస్తారు.అడ్డతీగల మండలంలో రాయపల్లి, అనంతగిరి మండలంలో అనంతగిరి, గుమ్మ అరకు వేలీ మండలంలో మాడగడ-1, పెదలబుడు-1 చింతూరు మండలంలో చింతూరు-1, ముకునూరు జికె వీధి మండలంలో దుప్పులవస, సీలేరు, హుకుంపేట మండలంలో గంనేరుపుట్టు, గట్టుం కూనవరం మండలంలో కూతూరు, ముంచుంగుపుట్టు మండలంలో బరడ, కిలగాడ, నెల్లిపాక మండలంలో కన్నాయిగూడెం, ఏటపాక, పెదబయలు మండలంలో కుంతర్ల, పెదకోడపల్లి, వి.ఆర్. పురం మండలంలో వడ్డిగూడెం, వై. రామవరం మండలంలో పాత కోట సచివాలయ పరిధిలో గ్రామాల్లో జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం జరుగుతుంది.

డుంబ్రిగుడ: పోతంగి సచివాలయ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు.గత నెల 24 నుంచి 30 వరకు గ్రామ వాలంటీర్లు ప్రతి ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై సర్వే చేశారు.ఈ మేరకు గిరిజనులకు సోమవారం ధ్రువపత్రాలను స్థానిక ఎంపీడీవో ఉషారాణి అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఇప్పటివరకు కొన్ని కారణాలతో సంక్షేమ పథకాలు పొందని ప్రతి ఒక్కరికి పథకాలు అందుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కామరాజు, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, విఆర్వో ఝాన్సీ, గ్రామ వాలంటీర్లు, గిరిజనులు పాల్గొన్నారు.

మారేడుమిల్లిలో సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎంపిపి, జెడ్పిటిసి

మారేడుమిల్లి : జగనన్న సురక్ష పేర ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సార్ల లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యులు గొర్లె బాలాజీ బాబు అన్నారు. మండలంలోని సున్నంపాడు సచివాలయంలో సోమవారం గ్రామ సర్పంచ్ వెలుగురి లచ్చి రెడ్డి అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమానికి 415 అర్జీలు రాగా, వెంటనే 312 సర్టిఫికెట్లు ఇవ్వడం జరిగింది. తహశీల్దారు టి.శ్రీనివాస్, ఎంపీడీఓ విత్తనాల శ్రీనివాస రావు, స్పెషల్ ఆఫీసర్ డేవిడ్, ఎంపీటీసీ మడకం అనిల్, కో-ఆప్షన్ సభ్యులు గురుకు ధర్మ రాజు, జెసిఎస్ కన్వీనర్ గొర్లె అనిల్ ప్రసాద్, వైసిపి నాయకులు సత్తి సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : మండలంలోని దూసరపాము, కిండ్ర గ్రామాల్లో తహశీల్దార్ సుబ్రహ్మణ్య ఆచారి, ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష గ్రామసభలు నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారులకు పలు రకాల ధ్రువ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పిటిసి ఒడుగుల జ్యోతి, సొసైటీ అధ్యక్షులు సింగిరెడ్డి రామకృష్ణ, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, సర్పంచ్‌లు చీడి శివ, భూసరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం : మండలంలోని ఫోక్స్‌పేట పంచాయతీ కార్యాలయ ఆవరణలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు అధికారుల సమీక్షలో నిర్వహించారు. గ్రామంలో 556 కుటుంబాలకు 11 రకాల వివిధ సేవల ధ్రువపత్రాలను ఉచితంగా అందజేశారు. ఫోక్స్‌పేట సర్పంచ్ పండా లక్ష్మి అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ఎంపిపి బంధం శ్రీదేవి, జెడ్పిటిసి పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపి పండా కుమారి, బాలకృష్ణ, ఇఒపిఆర్‌డి జాన్ మిల్టన్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కూనవరం : మండలంలోని రేగులపాడు సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు కుల, ఆదాయ తదుపరి ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పిటిసి గుజ్జ విజయబాబు, జెసిఎస్ కన్వీనర్ ఆవుల మరియదాస్, మేరుకుల డైరెక్టర్ దీకొండ గంగాధర్ రావు, సొసైటీ చైర్మన్ నోముల కొండలరావు, గిరిజన సంక్షేమశాఖ అధికారి మురళి, తహశీల్దార్ అనసూయ, ఎంపీడీఓ ప్రేమ్ సాగర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కొయ్యూరు : మండలంలోని గదపాలెం, చిట్టంపాడు సచివాలయాల్లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జెడ్పిటిసి వారా నూకరాజు, ఎంపీడీఓ లాలం సీతయ్య, చిట్టంపాడు, మూలపేట సర్పంచ్‌లు నూకాలమ్మ, వెంకటలక్ష్మి, డౌనూరు ఎంపీటీసీ బిడిజన అప్పారావు, నాయకులు



కూనవరంలో...

కొయ్యూరులో...

రాజవొమ్మంగిలో...

నిధులిమ్మంటే అరెస్ట్ చేస్తారా?

ప్రజాశక్తి -అనందపురం: గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులను సర్పంచ్‌ల సంతకాలు లేకుండా దారిమళ్లించి, సర్పంచ్‌ల హక్కులను వైసిపి ప్రభుత్వం కాలరాస్తోందని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వానపల్లి లక్ష్మి ముత్యాలరావు అన్నారు. దీనిపై పంచాయతీరాజ్ కమిషనర్‌కు విన్నవించేందుకు తాడేపల్లి వెళుతున్న సర్పంచ్‌లను అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం 2019-22 వ ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి 14,15వ ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్రంలోని 12918 గ్రామ పంచాయతీలకు రూ. 8,660 కోట్లను కేటాయిస్తే, సర్పంచుల సంతకం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం దొంగలించి, దారి మళ్లించి, సొంత అవసరాలకు వాడుకుందన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం ద్వారా కేంద్రం పంపిన రూ.2010 కోట్లు, ఈ ఏడాది రావాల్సిన రూ.2020 కోట్లతో కలిపి, రూ.12690 కోట్లను వెంటనే సర్పంచుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. సర్పంచులకు, ఎంపిటిసిలకు గౌరవ వేతనం నెలకు రూ.15 వేల ఇవ్వాలని, గ్రామ సచివాలయాలు, వాలంటీర్లను గ్రామపంచాయితీల ఆధీనంలోకి తీసుకురావాలన్నారు. దీనిపై కమిషనర్‌కు విన్నవించేందుకు వెళుతున్న సర్పంచ్‌లను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.

హామీలకే పరిమితం

- శిథిలావస్థలో అల్లూరి సమాధులు
- పెచ్చులూడిపోయిన పైకప్పు
- పట్టించుకోని పర్యాటకశాఖ
- నేడు అల్లూరి 125వ జయంతి

అల్లూరి, గంటం దొర సమాధులు

విప్లవాన్ని నడిపించిన మన్యం వీరుడు అల్లూరి చరిత్రకు నేటికీ పూర్తిస్థాయి గుర్తింపు తీసుకురావడంలో పాలకులు విఫలమయ్యారు. అల్లూరి విప్లవం చేసిన ప్రదేశాలను అభివృద్ధి చేయడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.ఈనెల 4న అల్లూరి 125వ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం...

అల్లూరి అసలు పేరు శ్రీ రామరాజు. ఆంగ్లేయుల చేతిరాత కారణంగా శ్రీరామరాజు బదులుగా సీతారామరాజుగా మార్పు చెందింది. విశాఖ జిల్లా పద్మనాభ మండలంలో 1897 జూలై 4న అల్లూరి సీతారామరాజు జన్మించారు. తూర్పుగోదావరి జిల్లాలో విద్యాభ్యాసం పూర్తిచేసిన ఆయన విశాఖ జిల్లా కేడిపేట ప్రాంతానికి వచ్చారు.గిరిజనులను బానిసలుగా చూస్తూ మోసం చేస్తున్న ఆంగ్లేయుల అకృత్యాలను సహించలేక మన్యం విప్లవాన్ని ప్రారంభించారు. 1922లో ప్రారంభమైన అల్లూరి విప్లవం 1924 మే 7న ఆయనను బందించి ఆంగ్లేయులు కాల్చి చంపడంతో ముగిసింది. మన్యం విప్లవం నడిచిన 2 సంవత్సరాల కాలంలో అల్లూరి పేరు అంటే తెల్లదొరలు గుండెలో రైళ్ళు పరిగెత్తేవి. విప్లవ సమయంలో ఆయన వరుసగా 1922వ సంవత్సరంలో ఆగష్టు 22న చింతపల్లి, 23న కృష్ణదేవిపేట 26న రాజవొమ్మంగి, 27న అన్నవరం, అడ్డతీగల, రంపచోడవరం పోలీసు స్టేషన్లపై దాడి చేసి ఆయుదాలను స్వాధీనం చేసుకున్నాడు. దీంతో బెంబేలెత్తిన తెల్లదొరలు అల్లూరిని పట్టుకోవడానికి ఎన్నో పథకాలు వేసి విఫలమై చివరకు 1924 మే 7న మంప సమీపంలో దొంగచాటున పట్టుకున్నారు. అక్కడ నుంచి రాజేంద్రపాలెం తీసుకు వచ్చి తుపాకీతో కాల్చి చంపారు.. అనంతరం గిరిజనులు గుర్తించడానికి కేడిపేట ఆయన మృతదేహాన్ని తీసుకువచ్చి సమాధి చేశారు. మన్యం విప్లవం సారధ్యం వహించి చారిత్రకంగా పేరు తెచ్చిన విప్లవ వీరుడు అల్లూరి నడయాడిన ఈ ప్రాంతాలను అభివృద్ధి చేస్తానని పాలకులు అధికారులు ప్రకటనలకే పరిమిత మవుతున్నారు.

పైకప్పు ఎగిరిన పగోడ

రంగులు వెలిసిపోయిన ముఖద్వారం

2003లో అప్పటి టిడిపి ప్రభుత్వం పర్యాటకశాఖను ఒప్పించడంతో అల్లూరి నడయాడిన ప్రాంతాలను దేశం మొత్తానికి తెలిసేలా అభివృద్ధి చేస్తామని రు.3.60 కోట్లతో కొన్ని ప్రతిపాదనలు చేసి మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. ఈ సొమ్ముతో అల్లూరి సమాదులున్న పార్కులో పర్యాటకులు విశ్రాంతి కోసం కాటేజీల ఏర్పాటు, సమాధులు ఆధునీకరణ, సమాధుల వద్ద నిత్యం వెలిగేలా అఖండ జ్యోతి ఏర్పాటు, పార్కులో అల్లూరి భారీ విగ్రహం, అల్లూరి చరిత్ర తెలిసేలా చిత్రపటాలుతో మ్యూజియం ఏర్పాటు, గ్రంథాలయం, అల్లూరి స్నానం చేసి పూజలు నిర్వహించే గాదిగుమ్మి జలపాతం కాటేజీలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకు రూ.23 లక్షలతో ఆదునీకరించి, వాటి చుట్టూ ఆకర్షించే పూలమొక్కలు, పలు రకాలచెటును పెంచి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించారు. పార్కులో టైల్స్ అమర్చారు. అప్పట్లో ప్రభుత్వం మారి పోవడంతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. కాంగ్రెసు ప్రభుత్వం హయాంలో పనులు మాత్రం జరగలేదు. 2013లో అప్పటి గిరిజన శాఖా మంత్రి బాలరాజు భద్రాచలం నుండి మంప, కేడిపేట, అరుకు వరకు పర్యాటక కారిడారుగా అభివృద్ధి చేస్తామన్నారు. అది కూడా కార్యరూపం దాల్చలేదు. 2014లో టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత సుమారు రూ.90 లక్షలతో పార్కులో పర్యాటకులు సేద తీరేందుకు కట్టిన పాకలు ఏర్పాటు, విశ్రాంతి తీసుకునే సిమ్మెంటు బల్లలు, మినీ ధియేటర్, గాదిగుమ్మి జలపాతం వద్ద పర్యాటకులు సేదతీరేందుకు షెడ్ల ఏర్పాటు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం సంరక్షకులుగా పనిచేస్తున్న వారిని గుర్తించి వారికి వేతనాలను మంజూరు చేశారు.

శిథిలావస్థలో సమాధులు

2019లో మంత్రి అవంతి శ్రీనివాసరావు పార్క్ అభివృద్ధికి 50 లక్షలు మంజూరు చేస్తానని చెప్పి హామీ ఇచ్చి వెళ్లిపోయారు. ఇప్పటికీ ఆ నిధులు మంజూరు కాలేదు.గతంలో ఏర్పాటు చేసిన ప్రగోడాలు(గడ్డితో ఏర్పాటు చేసిన ఆకర్షణమైన పాకలు) శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. సమాధులు ఉన్న పైకప్పు ప్రాంతమంతా పెచ్చులూడి పడిపోతుంది. పార్కులో గత రెండు సంవత్సరాల నుంచి తాగునీటి సమస్య తీవ్రంగా వుంది. దీనిపై అధికారులకు విన్నవించినా పట్టించుకునే పరిస్థితి ఎక్కడా కనిపించలేదు. అల్లూరి జాతీయ యువజన సేవా సంఘం గౌరవ అధ్యక్షులు పడాల వీరభద్రరావు ఆధ్వర్యంలో పలు మార్లు అల్లూరు నడియాడిన ప్రాంతాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వంతో పోరాడినప్పటికీ పూర్తిస్థాయి చర్యలు నేటికీ చేపట్టలేదు. పర్యాటక శాఖ అధికారులు 1.16 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తామని ప్రకటించి ఏడాది కావస్తున్నా ఇప్పటివరకు కనీసం ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. ఇప్పటికైనా పర్యాటకశాఖ అధికారులు అల్లూరి పార్కుపై దృష్టి సారించి అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

అల్లూరి పార్కులో చేయాల్సిన పనులు:

పార్కులో సభలు, సమావేశాలు నిర్వహించేందుకు సభావేదిక, పార్కులో సోలార్ విద్యుత్, అరుకు నుండి కేడీపేట మీదుగా పర్యాటకులకు బస్సు సౌకర్యం, గంధ్రాయం ఏర్పాటు క్యాంటీన్ ఏర్పాటు చేయవల్సి ఉంది.

అల్లూరిపార్కుకు చేరుకోవాలంటే :

అల్లూరి సీతారామరాజు పార్కును సందర్శించే పర్యాకులు నర్సీపట్నం నుండి కృష్ణదేవిపేట బస్సు ఎక్కాలి. అక్కడి నుండి శరచన్నపాలెం, చింతపల్లి రహదారివైపు అరకిలో మీటరు నడిచివెళ్లాలి. లేకుంటే ఆటోల సౌకర్యం ఉంటుంది. అలాగే ప్రతి 10 నిమషాలకు నర్సీపట్నం నుండి ఆర్టీసీ బస్ సౌకర్యం ఉంది.

అల్లూరికి నివాళులర్పిస్తున్న పోలీస్ సిబ్బంది, పడాల వీరభద్రరావు

అల్లూరి దాడి చేసిన పోలీస్ స్టేషన్‌ను సంరక్షించాలి

ప్రజాశక్తి - రాజవొమ్మంగి : మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు దాడి చేసిన రాజవొమ్మంగి పాత పోలీస్ స్టేషన్‌ను సంరక్షించాలని అల్లూరి సీతారామరాజు జాతీయ యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన రాజవొమ్మంగి పాత పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. అల్లూరి 125వ జయంతి ముగింపు ఉత్సవాన్ని పురస్కరించుకొని బ్రిటిష్ కాలం నాటి పోలీస్ స్టేషన్‌లో ఉన్న అల్లూరి విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ అల్లూరి చరిత్రలో రాజవొమ్మంగి ప్రాంతం ప్రాధాన్యత సంతరించుకుందని, 1922 ఆగస్టు 24న అల్లూరి సీతారామరాజు రాజవొమ్మంగి పోలీసు స్టేషన్‌పై దాడి చేసిన సందర్భంగా స్టేషన్లో బందీగా ఉన్న లాగరాయి పితురీరు నాయకుడు వీరయ్య దొరను విడిపించడం జరిగిందని తెలిపారు. 1924 మే 1 నుండి 6 వరకు రాజవొమ్మంగి మండలం కొండపల్లి గ్రామంలో అల్లూరి సేనాలకు బ్రిటిష్ వారికి భీకర తుది పోరు జరిగిందని గుర్తు చేశారు. అక్కడ నుండి సీతారామరాజు తప్పించుకొని మంప వెళ్లి అక్కడ పట్టు పడడం జరిగిందని తెలిపారు. అల్లూరి చరిత్రలో ప్రధాన ఘట్టం జరిగిన రాజవొమ్మంగి మండలం కొండపల్లి గ్రామంలో ఆయన స్మారక చిహ్నాన్ని నిర్మించి ఆ గ్రామాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ వి.జాన్ కుమార్, అల్లూరి సీతారామరాజు యువజన సంఘం నాయకులు శ్యామల వరలక్ష్మి, ఎల్.బాబ్జి, సోమిరెడ్డి రాజు, హెడ్ కానిస్టేబుల్ పాండురంగ, రాజబాబు, పోలీస్ సిబ్బంది సూర్యప్రకాశ్, పెద్దబ్బాయి, మునిసా, పి మీనా కుమారి, తదితరులు పాల్గొన్నారు.

జ్వరంతో బాధపడుతున్న చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యాధికారి హిమబిందు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - సీలేరు : గిరిజనులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని దారకొండ పీహెచ్సీ వైద్యాధికారి డీకే హిమబిందు అన్నారు. సోమవారం చింతపల్లి మండలం లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇద్దరు వైద్యులు సెలవుపై వెళ్లడంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జమీల్ బాషా ఆదేశాల మేరకు వారపు సంతలో డాక్టర్ హిమబిందు వైద్య శిబిరం ఏర్పాటు చేసి186 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే ఎపిడమిక్ సీజన్ ప్రారంభం కావడంతో గిరిజన గ్రామాల్లో జ్వరాలు, అతిసారా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, జ్వర బాధితులు వెంటనే ఆసుపత్రికి వచ్చి రక్త పరీక్ష చేయించుకోవాలని సూచించారు. మలేరియా, టైఫాయిడ్ నిర్ధారణ అయితే క్రమంగా మందులు వాడాలని, జ్వరాలపై నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. ఆదివాసీలు పసర మందులు, నాటు వైద్యానికి పూర్తిగా దూరంగా ఉండాలన్నారు. చిన్నపిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ గుల్లెల సింహాద్రి పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్.. కొత్త ఉద్యోగాలు తెస్తుందా ?

బెంగళూరు, చెన్నయ్, హైదరాబాద్‌ల్లో పనిచేస్తున్న వారినే విశాఖకు తీసుకొస్తారా ?
- ఐటి రంగంపై నగరంలో చర్చ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఈ నెలాఖరుకు విశాఖలో ఇన్ఫోసిస్ కార్యకలాపాలు ప్రారంభించే అవకాశాలున్నాయి. దీంతో ఐటి రంగంపై ప్రస్తుతం ఎక్కడికక్కడ చర్చ నడుస్తోంది. సదరు సంస్థ కొత్త ఉద్యోగాలు సృష్టిస్తుందా.. ఎక్కడెక్కడో ఉన్న ఉద్యోగులను ఇక్కడకు తెచ్చి సర్దుబాటు చేస్తుందా ? అన్న విషయంపై చర్చ సాగుతోంది.

ప్రస్తుతం విశాఖ రుషికొండలో సుమారు 25 ఐటి కంపెనీల్లో మూడు వేల మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. త్వరలో ఇన్ఫోసిస్ రానుండటంతో కొత్త ఉద్యోగాలు వస్తాయా ? అంటే అలాంటిదేమీ లేదని ఐటి రంగ నిపుణులు కుండబద్దలు కొట్టి చెబుతున్నారు. ఇన్ఫోసిస్ విశాఖకు రాగానే ఆరు వేల మంది పాత ఉద్యోగులే (చెన్నయ్, బెంగళూరు, హైదరాబాద్‌లలో పనిచేస్తున్న వారు) ఇక్కడ కొచ్చి విధులు నిర్వహించనున్నారని తెలుస్తోంది. ఇతర రాష్ట్రాల్లో ఇన్ఫోసిస్‌లో పనిచేసే వారికోసం విశాఖలో ఏర్పాటు చేసే ఎరేంజ్‌మెంట్‌గా దీన్ని ఐటి నిపుణులు పేర్కొంటున్నారు.

విశాఖలో ఇన్ఫోసిస్ బ్రాంచి కార్యాలయం

విశాఖలో అదిగో.. ఇదిగో అంటూ ఇన్ఫోసిస్ ఐటి సంస్థపై రాష్ట్ర ముఖ్యమంత్రి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల వరకూ ప్రకటనలు చేస్తూనే ఉన్నారు. ఈ నెలాఖరుకు ఆరు వేల మంది ఉద్యోగులతో ఆ సంస్థ రుషికొండలో అడుగుపెట్టనున్నట్టు తెలుస్తోంది. షిఫ్టుల వారీగా అంటే నెలలో రెండు వారాల పాటు ఆఫీసుకు సిబ్బంది వచ్చేలాగ వర్క్ ఛార్టర్ నిర్దేశించినట్లు తెలుస్తోంది. కోవిడ్ అనంతరం వర్క్‌ఫ్రం హోమ్ కాన్సెప్ట్‌కు ప్రపంచ దేశాలన్నీ దాదాపు చెల్లుచీటి ఇచ్చాయి. తాజాగా ఐటి కంపెనీలు కొత్త నినాదం అందుకున్నాయి. 'కూర్చొని నేర్చుకోవడం కష్టం.. బయట జనాలతో కలవాలి' అంటూ ఉద్యోగులకు తాజాగా బోధిస్తున్నాయి. ఇదిలా ఉండగా ఇన్ఫోసిస్ మాత్రమే కాకుండా హెచ్‌సిఎల్, టిసిఎస్ కూడా విశాఖపై ఆసక్తి చూపుతున్నాయని రాష్ట్ర ఐటి రంగ ప్రతినిధులు చెబుతున్నారు. ప్రభుత్వంతో చర్చలు, సంప్రదింపులు జరుగుతున్నట్టు పేర్కొంటున్నారు. మద్దిలపాలెం సెంటర్‌లోని విప్రోలో 'పల్సస్' సంస్థ కొన్నాళ్లుగా కార్యకలాపాలు సాగిస్తోంది. దీని లీజు 2024తో ముగియడంతో వీరు ఆ భవనాన్ని త్వరలోనే ఖాళీ చేయనున్నారు. రుషికొండ హిల్స్‌లో సొంత భవనాన్ని పల్సస్ నిర్మించుకుని అక్కడకు షిఫ్ట్ అవుతోంది. అప్పుడు టిసిఎస్, హెచ్‌సిఎల్ విప్రో స్థలంలోకి వచ్చే అవకాశాలున్నాయి.

యుఎస్ సంక్షోభంతో ఐటి ఆర్డర్లు ఉన్నాయా ?

అమెరికాలో ఆర్థిక సంక్షోభం ఇప్పట్లో సమసిపోయే అవకాశం లేదని ఐటి రంగ నిపుణులు, ఐటాప్ ప్రతినిధులు 'ప్రజాశక్తి' వద్ద వెల్లడించారు. 'ఐటి ఇండస్ట్రీకి డిమాండ్ అయితే విశాఖలో ఉంది. యుఎస్ సంక్షోభంతో వర్క్ లోడ్ తగ్గింది. వచ్చే ఆరు నెలల్లో అంటే 2024 ఏప్రిల్ నాటికి ఇది సమసిపోవచ్చని ప్రపంచ ఆర్థికవేత్తల తాజా అంచనా. ఈ సంక్షోభ ఎఫెక్ట్‌తో దేశంలోని చెన్నయ్, బెంగళూరు, హైదరాబాద్, విశాఖపట్నంలలో ఐటి కంపెనీలు విస్తరణ ఊసు ఎత్తడం లేదు. కొత్త వారిని హైరింగ్ చేయడం మానేశారు' అని వారంటున్నారు.

'ఉక్కు'ను ప్రైవేటీకరిస్తే ప్రజలు ఊరుకోరు

దీక్షల్లో కూర్చున్న నాయకులు, ఉక్కు కార్మికులు

ప్రజాశక్తి - ఉక్కునగరం, కలెక్టరేట్

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రైవేటీకరిస్తే ప్రజలు ఊరుకోరని, రానున్న కాలంలో తగిన బుద్ధి చెబుతారని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 872వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ డబ్ల్యుఎండి, యుటిలిటీస్, అడ్మిన్ టిటిఐ విభాగాలకు చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ మూడు నెలల పాటు నిల్వ ఉండాల్సిన రా మెటీరియల్‌ను కొన్ని రోజులకే పరిమితం చేయడం కేంద్ర ప్రభుత్వ కుట్రలో భాగమేనన్నారు. ప్రస్తుతం ప్లాంట్ పూర్తిస్థాయి ఉత్పత్తిని అందుకునేందుకు రూ.3 వేల కోట్లు అవసరమవుతుందని, బ్యాంకుల ద్వారా రుణం పొందేందుకు ప్రయత్నించగా మోడీ సర్కారు అడ్డుపడటం దుర్మార్గమని అన్నారు. సొంత గనులు లేకున్నా లాభాలు ఆర్జించిన విశాఖ ఉక్కు కర్మాగారంపై కుట్రలకు తెగబడటం దారుణాతిదారుణమన్నారు. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు ఎస్.సత్యనారాయణ, శ్రీనివాసరావు, పి.శ్రీనివాస్, నరేంద్ర, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద..

స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు సోమవారానికి 823వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఇంటి పనివారల సంఘం కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి సిఐటియుఐ నాయకులు పి.బాలభాను మాట్లాడారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్ సంస్థలకు అమ్మే అధికారం మోడీ ప్రభుత్వానికి లేదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.లక్ష్మి, కె.దుర్గ, అప్పయ్యమ్మ, పాపయమ్మ పాల్గొన్నారు.

పట్టబడ్డ గంజాయి, నిందితులతో పోలీసులు

10 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-కొయ్యూరు : ఏజెన్సీ నుండి మైదాన ప్రాంతానికి బైక్ మీద తరలిస్తున్న 10 కేజీల గంజాయిని మండలంలోని దొడ్డవరం గ్రామం సమీపంలో పోలీసులు స్వాధీనం చేసుకొని, ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... చింతపల్లి మండలంలోని మారుమూల గ్రామాల నుండి పెదవలస, బోదరాల్ల, చీడిపాలెం మీదుగా బైక్‌పై గంజాయి తరలిస్తున్నారు. సోమవారం సాయంత్రం దొడ్డవరం గ్రామ శివారు వద్ద కొయ్యూరు పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా అటుగా వస్తున్న బైక్‌ను ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద 10 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. గంజాయిని స్వాధీనం చేసుకొని, నిందితులు రాజమండ్రికి చెందిన షేక్ రిజ్వన్, చింతపల్లి మండలానికి చెందిన కొర్ర మోహన్ బాబును అరెస్టు చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. కొయ్యూరు ఎస్ఐ రాజారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజనేతరులను వెంటనే అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - రంపచోడవరం : రంపచోడవరం డివిజన్ పరిధి అడ్డతీగలలో గిరిజనులు గిరిజనేతరుల మధ్య ప్రభుత్వ స్థలంలో బడ్డీ కొట్టు విషయంలో జరిగిన తగాదా విషయంలో గిరిజనేతరుడు ముప్పనశెట్టి శ్రీనుతో పాటు ఏడుగురిగిని తక్షణమే అరెస్టు చేయాలని ఆదివాసీ జెఎసి నాయకులు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిందితులపై ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కేసు విషయంలో 15 రోజుల్లో అరెస్టు చేయాల్సి ఉండగా, పోలీసులు నిందితులకు కొమ్ముకాస్తూ రెండు నెలలు కావస్తున్నా ఇంత వరకు ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. ఒక గిరిజనుడు తెలిసీ తెలీక తప్పు చేస్తే క్షణాల్లో కేసు కట్టి బోన్‌లో నిలబెట్టే పోలీసులు, గిరిజనేతరుల ఎంత పెద్ద తప్పు చేసినా చూసీ చూడనట్లుగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా పోలీసులు ముప్పనశెట్టి శ్రీను, మిగతా వారిని వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించాలని డిమాండ్ చేశారు. లేకుంటే జిల్లా కలెక్టర్, ఎస్పి, డిఐజి, డిజిపి తదితరులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ప్రటకన విడుదల చేసిన వారిలో జెఎసి నాయకులు కంగల శ్రీనివాస్, పోడియం పండు దొర, కారం రామన్నదొర, చవలం శుభ కృష్ణ, మట్ల కృష్ణారెడ్డి, పోడియం శ్రీనుబాబు, పందుల కామరాజు, స్వప్న కుమారి తదితరులున్నారు.

ఇగ్నో అడ్మిషన్ల గడువు పెంపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో వివిధ దూరవిద్యా కోర్సులతో పాటు ఆన్‌లైన్ కోర్సులలో ప్రవేశాల కోసం గడువును ఈ నెల 15వ తేదీ వరకూ పెంచినట్టు ఇగ్నో ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయం అందిస్తున్న అన్ని సర్టిఫికెట్, డిప్లొమా, పిజి డిప్లొమా, డిగ్రీ, అన్ని పీజీ కోర్సులలో ప్రవేశాలు ఈ నెల 15 వరకూ లభిస్తాయన్నారు. ఈ విద్యా సంవత్సరానికిగానూ ఇగ్నో అనేక రంగాలలో యువతకు ఉపాధి అవకాశాలు పెంచే కొత్త కోర్సులను అందిస్తోందన్నారు. ఈ అడ్మిషన్లను https://ignouadmission.samarth.edu.in ద్వారా పొందవచ్చని తెలిపారు. విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం పరిధిలోని 11 జిల్లాల్లో ఉన్న అధ్యయన కేంద్రాలన్నింటిలో ఈ విద్యా సంవత్సరానికిగానూ ప్రవేశాలు పొందే వీలుందని తెలిపారు. ప్రవేశాలన్నీ ఆన్‌లైన్ విధానం ద్వారా మాత్రమే అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఫీజులు కూడా ఆన్‌లైన్‌లోనే చెల్లించాల్సి ఉందన్నారు. ఎంపిక చేసిన కోర్సులలో ఎస్సి, ఎస్టి విద్యార్థుల కోసం పూర్తి ఫీజు రాయితీని విశ్వవిద్యాలయం కల్పిస్తోందన్నారు.